# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ | బుధవారం 5-8-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 3 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఉత్తరాంధ్ర జానపద శిఖరం వంగపండు కన్నుమూత

## జానపద బాణీతో ఉర్రూతలూగించిన వాగ్గేయకారుడు



విశాఖపట్టణం,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): ఏం పిల్లడో ఎల్దమొస్తవా అంటూ.. ప్రజలను చైతన్యం చేసిన.. ఉత్తరాంధ్ర జానపద శిఖరం కుప్పకూలింది. ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు విజయనగరం జిల్లా పార్వతీపురం వైకెఎం నగర్‌లో ఈ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు.. 1943లో విజయనగరం జిల్లా పార్వతీపురం సమీపంలోని పెదబొండపల్లిలో జన్మించిన వంగపండు... ఉత్తరాంధ్ర గద్దర్‌గా పేరుగాంచారు, జన నాట్యమండలికి అధ్యక్షుడిగా పనిచేసారు.. 2017లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి కళారత్నపురస్కారం అందుకున్నారు. పీపుల్స్‌వార్ సాంస్కృతిక విభాగం అయిన జననాట్యమండలిని స్థాపించారు.. 400కి పైగా జానపద గీతాలు రాసిన వంగపండు.. 30కిపైగా సినిమాలకి పాటలు రాశారు.. ఆయన ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ.. వారిని పోరాటానికి సిద్ధం చేస్తూ.. ఏం పిల్లడో ఎల్దమొస్తవా అంటూ పాడిన పాట ఎందరినో ఆలోచింపజేసింది.. కరోనా సమయంలో.. కవులు, కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. వారిని ఆదుకోవాలంటూ తాజాగా డిమాండ్ చేసిన వంగపండు.. మంగళవారం తుదిశ్వాస విడవడంతో.. కవులు, కళాకారులు సంతాపాన్ని ప్రకటించారు.

వంగపండు మృతికి సీఎం సంతాపం

త్తరాంధ్ర జానపద శిఖరం, ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు . వంగపండు ఇక లేరన్న వార్త ఎంతో బాధించిందని పేర్కొన్న ఆయన.. ఆయన వ్యక్తిగతంగా నాకు ఆప్తులు... జానపదాన్ని తన బాణీగా మార్చుకుని 'పామను పొడిచిన చీమలు'న్నాయంటూ ఉత్తరాంధ్ర ఉద్యమానికి అక్షర సేనాధిపతిగా మారారని తన ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగువారి సాహిత్య, కళారంగాల చరిత్రలో ఓ మహాశిఖరంగా ఆయన నిలిచిపోతారన్న సీఎం.. వంగపండు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

వంగపండు మృతి తీరని లోటు: అవంతి

ఉత్తరాంధ్ర జానపద కళాకారుడు వంగపండు ప్రసాదరావు మృతి తీరని లోటని క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. వంగపండు ప్రసాదరావు సాంస్కృతిక రంగానికి ఓ ఆణిముత్యం. అలాంటి ఆణిముత్యం భౌతికంగా దూరం కావడం బాధాకరం. వంగపండు పాటలోనే సామాజిక చైతన్యం ఉంది. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని

తెలియజేస్తున్నాను అని పేర్కొన్నారు.

సంతాపం తెలిపిన లక్ష్మణరెడ్డి

ఉత్తరాంధ్ర జానపద శిఖరం, ప్రజాకవి, కళాకారుడు వంగపండు ప్రసాదరావు మృతి తీరని లోటని ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. వంగపండు మృతికి మంగళవారం ఆయన ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జానపదాన్ని ప్రపంచ స్థాయికి తీసుకుని వెళ్లిన కళాకారుడు వంగపండు. ఆయన విజయనగరం జిల్లా వాసి కావడం తెలుగువారికి గర్వకారణమన్నారు.

తన పాటలు, రచనలు, ప్రదర్శనలతో వంగపండు ప్రజల్లో చైతన్యం నింపారని, దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజల కష్టాలను తన పాటలతో వినిపించిన గొప్ప కళాకారుడని తెలిపారు. జానపదాన్ని తన బాణీగా మార్చుకుని ఉర్రూతలూగించి.. తెలుగువారి సాహిత్య, కళారంగాల చరిత్రలో ఒక మేరుశిఖరంగా వంగపండు నిలిచిపోతారని లక్ష్మణరెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర గళం వంగపండు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారన్న వార్త దిగ్భ్రాం÷-రతికి గురిచేసిందన్నారు. వందలాది జానపద గేయాలతో ఆయన ప్రజల్లో స్ఫూర్తిని రగిల్చారని వంగపండు కుటుంబ సభ్యులకు లక్ష్మణరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వంగపండు మృతికి వినోద్ సంతాపం

అలాగే ప్రజా వాగ్గేయకారుడు, జానపద దిగ్గజం వంగపండు ప్రసాద్ మృతి చెందడం బాధాకరమని తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. ఉత్తరాంధ్ర వాసి అయినా.. తెలంగాణ ఉద్యమానికి వంగపండు సంపూర్ణ మద్దతు పలికారని వినోద్ కుమార్ గుర్తు చేశారు. ఏం పిల్లడో వెళదామస్తవ.. పాముని పొడిచిన చీమలున్నాయట.. వంటి అనేక పాటలు రాసి గజ్జె కట్టి ఆడిపాడి ప్రజలను చైతన్య వంతులను చేశారని వినోద్ కుమార్ పేర్కొన్నారు. వంగపండు కుటుంబ సభ్యులకు ఆయనర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు

# చిన్నారి హత్య కేసులో ఉరిశిక్ష

## సంచలన తీర్పు వెలువరించిన కోర్టు

విజయవాడ,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): కృష్ణాజిల్లా చిన్నారి హత్య కేసులో జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. మైనర్ బాలిక హత్య కేసులో నిందితుడికి ఉరి శిక్ష విధిస్తూ కోర్టు తీర్పును వెల్లడించింది. 2019 నవంబరులో ద్వారకా అనే అమ్మాయిని పెంటయ్య కిడ్నాప్ చేసి హత్య చేశాడు. అతనిపై నేరం రుజువు కావడంతో ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తీర్పుపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ... గొల్లపూడి నల్లకుంట వద్ద ఏడేళ్ల చిన్నారిపై పెంటయ్య అత్యాచారం చేసి హత్య చేశాడని తెలిపారు. పాప మృతదేహాన్ని గోనె సంచిలో కుక్కి పారేయాలని నిందితుడు ప్రయత్నించాడని అన్నారు. ఆరోజు పాప కనిపించడం లేదని.. తల్లిదండ్రులుతో కలిసి వెతికాడని చెప్పారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారించి పెంటయ్యను దోషిగా నిర్ధారించారన్నారు. భవానీపురం పోలీసులు సాంకేతికపరమైన ఆధారాలు సేకరించడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారని వెల్లడించారు. ఈ కేసులో 7యేళ్లు, 20యేళ్లు, జీవిత ఖైదు, ఉరిశిక్షను న్యాయమూర్తి విధించినట్లు చెప్పారు. ఉరి శిక్షను హైకోర్టు ఖరారు చేయాల్సి ఉందని.. డిఫెన్స్ కూడా నేరం చేసినట్లు అంగీకరించిందని నారాయణరెడ్డి వెల్లడించారు.

### ఉరి శిక్షే సరైన శిక్ష: తండ్రి అనిల్

పెదనాన్న అని పిలిచిన తన కుమార్తెను అత్యంత కిరాతకంగా చంపాడని... ఆరోజు ఏమీ ఎరుగనట్లుగా తమతో కలిసి పాప కోసం వెతికాడని ద్వారక తండ్రి అనిల్ తెలిపారు. పోలీసుల విచారణలో పెంటయ్య నిందితునిగా తేలిందని... చిన్నారిని చంపినందుకు ఉరి శిక్షే సరైన శిక్ష అని అన్నారు. తమకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. పెంటయ్య భార్య కూడా తన భర్తకు ఉరి శిక్ష వేయాలని కోరిందని తెలిపారు. ప్రస్తుతం తాము ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామని... సీఎం స్పందించి తమకు ఆర్థిక సాయం అందించాలని అనిల్ కోరారు.

## చరిత్రలో నేటినిజం





-రాధశ్రీ

సెల్: 9494481210

# అయోధ్యకు పయనమైన యోగాగురు బాబా రాందేవ్

అయోధ్య,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): అయోధ్యలోని రామాలయం భూమి పూజకు సన్నాహాలు పూర్తయ్యాయి. మూడు రోజుల భూమి పూజ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఆగస్టు 5 న ప్రధాని నరేంద్ర మోదీ ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. తాజాగా యోగా గురువు బాబా రామ్‌దేవ్ అయోధ్యలో జరిగే భూమి పూజకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన ఒక వీడియోను షేర్ చేసి, తాము శ్రీరాముని జన్మస్థలం అయోధ్యకు బయలుదేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లభించడం మన అదృష్టమని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా అయోధ్యకు బయలుదేరనున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి మేరకు మధుర, కాశీ, చిత్రకూట్, ప్రయాగ్‌రాజ్, నైమిశారణ్యం, గోరఖ్‌పూర్ తదితర తీర్థయాత్రా నగరాల్లో ఈ రోజు నుంచి అఖండ నామ సంకీర్తన, రామాయణ పారాయణలు జరగనున్నాయి.

# దేశంలో అపరిష్కృతంగా 3కోట్ల కేసులు

## త్వరగా న్యాయం జరిగేలా చూడాలి యువన్యాయవాదులు ముందుకు రావాలి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన

న్యూఢిల్లీ,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): అత్యున్నత న్యాయస్థానం నుంచి కిందిస్థాయి కోర్టుల వరకు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్న అపరిష్కృత కేసుల విషయంలో ప్రభుత్వంతో పాటు, సుప్రీంకోర్టు, హైకోర్టులు, న్యాయ మంత్రిత్వ శాఖలు దృష్టిపెట్టాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. అన్ని స్థాయిల్లో 3కోట్లకు పైగా కేసులు అపరిష్కృతంగా ఉండటం విచారకరమన్నారు. కేసుల సంఖ్య ఇలా పెరుగుతున్నందున కీలకమైన కేసుల్లోతీర్పు కూడా ఆలస్యమవుతోందన్నారు. తద్వారా సామాన్యులకు న్యాయప్రక్రియ చాలా ఖరీదైన వ్యవహారంగా మారుతున్నదన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ అనుబంధ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయకళాశాల 76వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన వెబినార్‌లో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని పేద, అణగారిన వర్గాలకు న్యాయపరమైన సహాయం చేయాలని.. వారి జీవితాలను మెరుగుపరిచేందుకు కృషిచేయాలని లా విద్యార్థులకు, యువ న్యాయవాదులకు ఉపరాష్ట్రపతి సూచించారు. నైతిక ప్రవర్తనను అలవర్చుకుని, నిర్భీతితో.. విధులు నిర్వహించాలన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో న్యాయవాదుల పాత్ర కీలకమనే విషయాన్ని గుర్తించాలని.. ప్రజల్లోచైతన్యం తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. 'జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్' అన్న మాటను ప్రస్తావిస్తూ.. కొన్ని సందర్భాల్లో అనవసరంగా కేసులను పొడగించడం, వాయిదా వేయడం జరుగుతోందన్నారు. దీనిపై న్యాయవాదులతో పాటు ఈ రంగంతో సంబంధమున్న ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరముందన్నారు. ఇది ఎవరినీ విమర్శించేందుకు అనడం లేదని.. న్యాయశాస్త్రాన్ని అభ్యసించినవాడిగా, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నందున.. తన దృష్టికి వచ్చిన అంశాలను ప్రస్తావిస్తున్నానన్నారు. క్లిష్టమైన చట్టాలను సరళీకృతం చేయాల్సిన అవసరముందని ఉపరాష్ట్రపతి అన్నారు. వినియోగంలో లేని 1600కు పైగా చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ దిశగా మరింత కృషి జరగాల్సి ఉన్నదన్నారు.

# హెచ్-1 వీసాదారులకు ట్రంప్ మరో షాక్

## ఫెడరల్ ఏజెన్సీల నియామకాలపై నిషేధం

వాషింగ్టన్,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): హెచ్-1బీ వీసాదారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో షాకిచ్చారు. ఫెడరల్ ఏజెన్సీలు విదేశీకార్మికులను, ప్రధానంగా హెచ్-1బీ వీసాలో ఉన్నవారిని నియమించకుండా ఉండేందుకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై ఆయన సోమవారం సంతకం చేశారు. కరోనా దెబ్బతో అతలాకుతలం అవుతున్న అమెరికాలో నిరుద్యోగం భారీగా పెరిగిపోయిన విషయం తెలిసిందే. దీంతో ట్రంప్ సర్కార్ నిరుద్యోగాన్ని తరిమికొట్టే అన్ని మార్గాలను అన్వేషించే పనిలో ఉంది. దీనిలో భాగంగానే ట్రంప్ హెచ్-1బీ వంటి వర్క్ వీసాదారులపై దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే అమెరికన్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ ఏడాది చివరి వరకు హెచ్-1బీ వీసాలతో పాటు ఇతర విదేశీ వీసాలను సైతం రద్దు చేస్తూ జూన్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఫెడరల్ ఏజెన్సీలు విదేశీ కార్మికులను నియమించుకోకుండా నిరోధించే ఉత్తర్వులు జారీ చేశారు. చౌకగా పనిచేసే విదేశీ కార్మికుల కోసం కష్టపడి పనిచేసే అమెరికన్లను తొలగించే నిర్ణయాలను తాను సహించబోయేది లేదని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు. అంతేగాక ఫెడరల్ ప్రభుత్వం అమెరికన్లను మాత్రమే నియమించుకొనేలా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేస్తున్నానని సోమవారం వైట్‌హౌజ్‌లో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. కాగా, ట్రంప్ తాజా ఉత్తర్వులు భారత ఐటీ నిపుణులకు భారీ దెబ్బ అనే చెప్పాలి.

# అయోధ్యలో సందడేసందడి

లక్నో,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): అలనాడు శ్రీరామ పట్టాభిషేకానికి అయోధ్యాపురిలో ఎంత సందడి, సంరంభం జరిగాయో కేవలం సినిమాల ద్వారా మాత్రమే మనకు తెలుసు. రామాయన కావ్యం ద్వారా మాత్రమే విన్నాం. ఆ మధురఘట్టం మన జీవితాల్లో నిరంతరం ఎదురయ్యేందంగా మనతో పెనవేసుకుని పోయింది. అయితే ఆ ఘట్టాన్ని ఎవరూ స్వయంగా చూడలేదు. కానీ.. రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేసే ఘడియలు సమీపించే కొద్దీ సాకేతపురి తన్మయత్వంతో పులకించిపోతోంది! అయోధ్య ప్రజలందరిలోనూ ఏదో తెలియని ఉద్వేగం ఆవహించుకుంది. అయోధ్య పురవీధులు కూడా అలౌకికానందంతో ఉన్నాయి. అయోధ్యలో కరసేవ తరవాత అంతటి ఉద్విగ్న పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. శంకుస్థాపన ఘడియలు దగ్గర పడడంతో పోలీసులు ఇప్పటికే నగరమంతా డేగకన్నుతో పహారా కాస్తున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి రాకపోవకలపై ఆంక్షలు విధించారు. రామచంద్రుడి ఆలయ నిర్మాణానికి భూమిపూజ అంటే అందరికీ పండుగే అన్నంత హడావిడి ఇప్పుడు అయోధ్యలో కానవస్తోంది. ఆ వేడుకను కళ్లారా చూడాలని ఆశ ఉన్నా కేవలం ఆహ్వానితులు మాత్రమే ఈ కార్యక్రమాన్ని

## రామాలయ నిర్మాణ శంకుస్థాపనకు భారీగా ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించిన సిఎం యోగి ఆదిత్యనాథ్

పరిమితం చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వీయ పర్యవేక్షణలో ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరుగనుంది.

అందరూ తమ తమ ఇళ్లల్లోనే ఉండి దీపాలు వెలిగించి రామాయణ పారాయణ చేయాలని కోరారు. ఈ బృహత్తర కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆయన ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన 175 మందిలో 135 మంది సాధుసంతులని శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ట్విటర్‌లో పేర్కొంది. ఈ వేడుకకు ఆహ్వానం అందుకున్న బీజేపీ సీనియర్ నేత ఉమాభారతి.. కరోనా ముప్పు నేపథ్యంలో తాను హాజరు కాబోనని తెలిపారు. బాబ్రీమసీదు-రామజన్మభూమి కేసులో కక్షిదారు అయిన ఇక్బాల్ అన్సారీ మాత్రం.. తనకు ఆహ్వానం అందినందున ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటానని స్పష్టం చేశారు. కోర్టు తీర్పుతో వివాదం ముగిసిందని ఆయన పేర్కొన్నారు. ట్రస్టు ద్వారా ఆలయ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించగా.. అందుకు భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందులో పాల్గొనడంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. యూపీ సీఎం యోగి ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మకంగా అభివర్ణించారు. 500 ఏళ్ల తర్వాత రామాలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతున్న ఈ సందర్భం ఉద్వేగభరితమైనదని పేర్కొన్నారు. కొత్త భారతదేశానికి ఇది పునాది అని వ్యాఖ్యానించారు. ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ప్రధాని మోడీ సహా కేవలం ఆహ్వానితులకు మా÷-రమే అనుమతి ఉంది. అయోధ్యలో నిర్మించబోయే రామ మందిర భూమి పూజకు 175 మంది ప్రముఖ అతిథులను ఆహ్వానించినట్లు రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. బీజేపీ సీనియర్ నేతలైన ఎల్‌కే అద్వానీ, మురళి మనోహర్ జోషి, న్యాయవాది కె పరాశరన్, ఇతర ప్రముఖులతో చర్చల అనంతరం ఆహ్వాన జాబితా తయారు చేశామని ట్రస్ట్ ప్రధా న కార్యదర్శి చంపత్ రాయ్ తెలిపారు.

ఈ కార్యక్రమానికి అనేక మంది ఆధ్యాత్మిక సంప్రదాయాలకు చెందిన 135 మంది సన్యాసులతో సహా 175 మంది ప్రముఖ అతిథులు హాజరవుతారని, ఆలయ పట్టణంలోని కొందరు ప్రముఖ పౌరులను కూడా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. దివంగత వీహెచ్‌పీ నాయకుడు అశోక్ సింఘాల్ మేనల్లుడు సలీల్ సింఘాల్ ఈ కార్యక్రమానికి 'యజ్మాన్' గా ఉంటారని, బీహార్ జనక్‌పూర్‌కు, ఉత్తర ప్రదేశ్, అయోధ్యలతో సంబంధాలు ఉన్నందున నేపాల్ నుంచి హిందూ దర్శకులను కూడా ఆహ్వానించినట్లు రాయ్ తెలిపారు. ఆలయ రూపకల్పనపై ఆధారపడిన పోస్టల్ స్టాంప్ ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుందని, ప్రధాని ప్రాంగణంలో 'పారిజాత' చెట్టును నాటనున్నట్లు రాయ్ వెల్లడించారు. వేడుక మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుంది. ఆలయ శిలాశాసనం కూడా ప్రారంభిస్తామని తెలిపారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని, హిందూ ఆచారాల్లో ఎలాంటి రంగు నిషేధించబడదని, దేవతలు ధరించే బట్టల రంగును పూజారులు నిర్ణయిస్తారని రాయ్ తెలిపారు.

# అయోధ్యలో భద్రత కట్టుదిట్టం

## ప్రత్యేక వస్త్రాలతో దర్శనమీయనున్న రామయ్య

అయోధ్య,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): అయోధ్యలో రామమందిర నిర్మాణానికి సంబంధించి బుధవారం 5న భూమి పూజ చేస్తున్న సందర్భంగా అయోధ్యలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో రాముడిని ప్రత్యేక వస్త్రాల్లో అలంకరించనున్నారు.

ఈ వస్త్రాలను ప్రత్యేకంగా తయారు చేయించారు.

అయోధ్యలోని బఢీ కుటియా ప్రాంతంలో చిన్న టైలరింగ్ దుకాణం నడిపే ఇద్దరు అన్నదమ్ములు శంకర్‌లాల్, భగవత్‌లాల్ బట్టలను కుట్టారు. రామమందిర భూమి పూజ కార్యక్రమానికి రాముడికి నవరత్నాలు పొదిగిన గ్రీన్, ఆరెంజ్ కలర్ మఖ్‌మల్ వస్త్రాలను వీళ్లు సిద్ధం చేశారు. అయోధ్యలోని ఆలయాలకు ఏళ్లుగా ఈ కుటుంబవే వస్త్రాలు కుడుతోంది. 'మా నాన్న బాబులాల్ 1985లో రాముడికి వస్త్రాలు కుట్టడం స్టార్ట్ చేశారు. కుట్టుమెషీన్‌ను, మమ్మల్ని వెంటబెట్టుకొని రామ జన్మభూమికి వెళ్లి అక్కడే బట్టలు కుట్టేవారు. రామమందిర కార్యక్రమానికి రాముడి కోసం రెండు రంగుల వస్త్రాలు సిద్ధం చేశామని తెలిపారు. 'ప్రతి బుధవారం రాముడికి ఆకుపచ్చ రంగు వస్త్రాలను ధరింపచేస్తారు. కాబట్టి ఆ రంగు వస్త్రాలు సిద్ధం చేశాం. అలాగే ఆరెంజ్‌రంగు వస్త్రాలు కార్యక్రమం కోసం సిద్ధం చేశాం' అని వివరించారు.

÷ూముడితో పాటు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, హనుమకు కూడా వెల్వెట్ బట్టతోనే వస్త్రాలు కుట్టామని శంకర్‌లాల్‌చెప్పారు. ద్వారాల తెరలు, పానుపు వస్త్రాలు దీంతోనే రెడీ చేశామన్నారు. తాము రామునికి, ఇంకొంత మంది దేవుళ్లకే బట్టలు రెడీ చేస్తామని, మరెవరికీ, చివరకు తమ కోసం కూడా కుట్టుకోమన్నారు. అయోధ్య రాముడికి వస్త్రాలు కుట్టే భాగ్యం దక్కడం తమ అదృష్టమన్నారు. ఆదివారమే ఆ బట్టలు తమకు అందాయని రామ్ మందిర ముఖ్య పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పారు.

# మన రాష్ట్రం నుంచే తొలి కరోనా టీకా

## పరిశోధనల్లో ముందున్న హైదరాబాద్ జీనోమ్ భారత్ బయోటెక్ సంస్థలో సమీక్షించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): తెలంగాణ నుంచే కరోనా వైరస్‌కు తొలి టీకా వస్తుందని మంత్రి కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఉన్న భారత్‌బయోటెక్ సంస్థ నుంచే ఆ టీకా వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఉన్న భారత్ బయోటెక్ వ్యాక్సిన్ ప్రొడక్షన్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రి కేటీఆర్ మంగళవారం సందర్శించారు. మంత్రి కేటీఆర్‌తో పాటు డాక్టర్ ఎల్లా, శ్రీమతి సుచిత్రా ఎల్లా కూడా పాల్గొన్నారు. భారత్ బయోటెక్ సంస్థ ఉద్యోగులతో మంత్రి మాట్లాడారు. సీఎండీ డాక్టర్ కృష్ణా ఎల్లా,



తెలంగాణ లైఫ్ సైన్సెస్ అండ్ ఫార్మా డైరక్టర్ శక్తి నాగప్పన్‌తో కలిసి మంత్రి చర్చను నిర్వహించారు. కరోనా వైరస్ వ్యాక్సిన్ తయారీలో భారత్‌బయోటెక్ ముందంజలో ఉండడం గర్వంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. కరోనాకు టీకా తొలుత హైదరాబాద్ నుంచి, అందులో భారత్ బయోటెక్ నుంచి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. టీకాల అభివృద్ధి, తయారీలో భారత్ భాగస్వామ్యం కీలకమైందని ప్రపంచదేశాలు పదేపదే చెబుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్ ప్రాముఖ్యత కూడా పెరిగినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నుంచి మూడవ వంతు వ్యాక్సిన్ ప్రపంచ దేశాలకు అందించడం గర్వంగా ఉందన్నారు. మీ అందరి నిరంతర కృషి వల్లే ఇది సాధ్యమవుతోందని మంత్రి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ కూడా మంత్రి కేటీఆర్ నిర్వహించిన చర్చలో పాల్గొన్నారు.

# ఆటో,క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

## -ఆర్టీఏ కార్యాలయ ముట్టడికి యత్నం

హైదరాబాద్,ఆగస్ట్4(ఆర్ఎన్ఎ): తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో,క్యాబ్‌డ్రైవర్ల యూనియన్లు మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముట్టడికి యత్నించాయి. పెద్దఎత్తున నిరసన తెలుపుతూ యూనియన్ నాయకులు ఆర్టీఏ కార్యాలయాన్ని ముట్టడించాలని ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు వెంకటేశం మీడియాతో మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 2019 మోటార్ వాహన చట్టం సవరణ బిల్లుని వెనక్కి తీసుకోవాలన్నారు. రవాణా రంగ కార్మికులకు రూ. 7,500 ఆర్థిక సహాయం ఇవ్వాలని తెలిపారు.కార్మిక చట్టాలను సవరించాలని కోరారు. ప్రైవేటు అప్పులను 6నెలలు వాయిదా వేయాలన్నారు. క్యాబ్ జేఏసీ నాయకుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. ఓల, ఉబర్ డ్రైవర్ల నుంచి యాజమాన్యం తీసుకుంటున్న 20 శాతం కమిషన్ ఆపాలన్నారు. టోల్ టాక్స్, రోడ్ టాక్స్‌లను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ చార్జీలను తగ్గించాలన్నారు. అయితే పోలీసులు సకాలంలో చేరుకుని వీరిని అడ్డుకున్నారు.

# రైతులతో పాటు చిరు వ్యాపారులకు రుణాలు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రంగారెడ్డి, ఆగష్టు 4: డీసీసీబీ ద్వారా రైతులతో పాటు చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గూల్‌లో భాగ్యనగర సహకార బ్యాంకులో రైతులకు నేడు రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీసీసీబీ ద్వారా రూ.240 కోట్ల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో 20 ఎకరాల్లో రైతుల కోసం గోదాంల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

